సాక్షి
తూర్పుగోదావరి
గురువారం । 31 । అక్టోబర్ । 2024



వెండి ఆభరణాల సమర్పణ

తుని రూరల్: లోవ దేవస్థానం తలుపులమ్మ తల్లికి గుంటూరుకు చెందిన అలూరి అనురాధ, శశిధర్ దంపతులు రూ.1.3 లక్షల విలువైన వెండి పాదుకలను ఈఓ పెన్మత్స విశ్వనాథరాజుకు అందజేశారు.




బడుగులపై పిడుగు

వారంతా రోజువారీ కూలీలు.. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలు.. దీపావళి బాణసంచా తయారీలో నిమగ్నం అయ్యారు.

8లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 18,891 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.60 అడుగులకు నీటిమట్టం చేరింది. డెల్టా కాలువలకు 8,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

వెస్ట్ జోన్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు గైట్ విద్యార్థిని



ఫర్జానా ఆష్మీ మొహ్మద్

రాజానగరం: జాతీయ సేవా పథం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నవంబర్ 12 నుంచి 21 వరకు జరిగే ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఆంధ్రా యూనివర్సిటీ తరఫున గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఫర్జానా ఆష్మీ మొహ్మద్ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండి ధనరాజ్ తెలిపారు. కేబీసీ నార్త్ మహారాష్ట్ర యూనివర్సిటీ(జలగావ్)లో జాతీయ స్థాయిలో ఈ పరేడ్ జరగనుంది. ఈ సందర్భంగా ఆ విద్యార్థినిని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్‌పీఓ షేక్ మీరా అభినందించారు.

220 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): బ్యాంకు గ్యారంటీ చెల్లించిన మిల్లులకు ధాన్యం కొనుగోలు ప్రక్రియను అనుసంధానం చేయాలని కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ చాంబర్లో ఖరీఫ్ 2024– 25 సంవత్సరంలో ధాన్యం సేకరణ పై జాయింట్ కలెక్టర్ చిన్న రాముడుతో కలసి సమన్వయ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరను అందిస్తామన్నారు. జిల్లాలో 220 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించామన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలోని రైతుల నుంచి 2 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ ప్రాథమిక లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఇప్పటివరకు 350 మంది రైతుల నుంచి 2,733 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. ఇందులో భాగంగా 213 మంది రైతులకు 253 ధాన్యం కొనుగోలు కూపన్లకు సంబంధించి రూ.4.25 కోట్లు జమ చేశామన్నారు. జిల్లాలో 117 కష్టమైజ్డ్ రైస్ మిల్లులను ధాన్యం కొనుగోలు ప్రక్రియకు అనుసంధానం చేశామన్నారు. బ్యాంక్ గ్యారంటీ చెల్లించని రైసుమిల్లలకు ధాన్యాన్ని పంపబోమన్నారు.

సమాచారం సేకరించాలి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేయడంలో భాగంగా ఇప్పటి వరకూ సుమారు 20 వేల మందికి చెందిన డేటా ధ్రువీకరించామని, మిగిలిన వినియోగదారుల సమాచారం సేకరించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఎస్ఓ జీవీఎస్ ప్రసాద్, గ్యాస్ కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జేసీ ఏజెన్సీ డీలర్లతో మాట్లాడుతూ అర్హత కలిగిన వినియోగదారులను గుర్తించి అవసరమైన డాక్యుమెంట్లను పొందాలన్నారు. జిల్లాలో 1,62,000 మంది లబ్ధిదారులకు రూ.42.45 కోట్ల మేర ప్రయోజనం చేకూరనున్నదని చెప్పారు.

మామూళ్ల పేలుళ్లు!

- సర్కారు వారి దీపావళి దందా
- ఒక్కో దుకాణానికి ఒక్కో ధర నిర్ణయించి మరీ వసూళ్లు
- కూటమి నేతలు, అధికారులు కలిసి యథేచ్ఛగా..
- రూ.10 వేల నుంచి రూ.40 వేల వరకూ రేటు ఫిక్స్
- అడిగినంత ఇస్తే అన్నీ తామే చూసుకుంటామని భరోసా
- జిల్లా వ్యాప్తంగా 388 షాపులకు అనుమతులు
- రాజమహేంద్రవరం నగరంలోనే 144 దుకాణాలు



రాజమహేంద్రవరం వీఎల్ పురంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

సాక్షి, రాజమహేంద్రవరం: కూటమి నేతల ధన దాహం పరాకాష్టకు చేరింది. ఇప్పటికే మట్టి అక్రమ రవాణాతో రూ.కోట్లు కొల్లగొట్టారు. మద్యం మాఫియా అవతారం ఎత్తారు. అనధికారిక బెల్టు షాపులతో రూ.లక్షలు గడిస్తున్నారు. ఇది చాలదన్నట్టు దీపావళి పండగను ఆసరాగా చేసుకున్నారు. అనుకున్నదే తరువాయి రంగంలోకి దిగారు. కొన్ని ప్రాంతాల్లో బాణసంచా దుకాణాల ఏర్పాటుపై కన్నేశారు. దుకాణానికి ఓ ధర నిర్ణయించి వసూళ్లకు పాల్పడ్డారు. తమకు మామూళ్లు ముట్టజెప్పితే చాలు.. అన్నీ తాము చూసుకుంటామని బాణసంచా వ్యాపారులకు భరోసా ఇచ్చారు. ఒక్కో దుకాణం నుంచి దుకాణం స్థాయి, సరకును బట్టి రూ.10 వేల నుంచి రూ.50 వేలు వసూలు చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో దుకాణాలకు అనుమతులు మంజూరు చేసే అగ్నిమాపక, రెవెన్యూ, పోలీసులు సైతం వసూళ్లకు పాల్పడినట్టు విమర్శలు ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా దీపావళి మామూళ్ల టపాసులు భారీగా పేలినట్టు సమాచారం. రాజమహేంద్రవరం సిటీ, రూరల్, రాజానగరం, అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం, నియోజకవర్గాల్లో ఈ తంతు యథేచ్ఛగా సాగినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో ఇలా..

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 388 దుకాణాలకు అధికారిక అనుమతులు అందాయి. రాజమహేంద్రవరం డివిజన్‌లో 263, కొవ్వూరు డివిజన్‌లో 125 దుకాణాలకు అధికారులు అనుమతులు జారీ చేశారు. ఒక్క రాజమహేంద్రవరం నగరంలోని ఆర్ట్స్‌కళాశాల, వీఎల్‌పురం తదితర ప్రాంతాల్లో 144 దుకాణాలు ఏర్పాటు చేశారు. ఉండ్రాజవరం, మీనానగరం –పంగిడి సరిహద్దు, కొమరిపాలెం, బిక్కవోలు, తాస్సిపూడి, రాధేయపాలెం తదితర గ్రామాల్లో బాణసంచా తయారీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో కొన్ని కేంద్రాలు లైసెన్సులు, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు సైతం పాటించడం లేదన్న ఆరోపణలున్నాయి. అగ్నిమాపక అధికారులు ఇప్పటి వరకు తనిఖీలు చేసిన దాఖలాలు లేవన్న విమర్శలున్నాయి.

రెన్యువల్‌కు ఓ ధర.. లైసెన్సుకో ధర

బాణసంచా విక్రయ దుకాణాల పాత లైసెన్స్‌లకు గాని.. కొత్త లైసెన్సులు, గోదాములు, తయారీ కేంద్రాలకు సంబంధించి నిర్వాహకులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన చలానాలు, ఇతర ఖర్చులు మొత్తం కలిపి రూ.550 మాత్రమే. ఈ ఆదేశాలేవీ అమలవడం లేదు. అధికారులు అడ్డగోలు వ్యవహారానికి తెర తీస్తున్నారు. లైసెన్స్ రెన్యువల్ అయితే ఓ ధర.. కొత్త లైసెన్సులకు మరో ధర.. లైసెన్స్ లేకుండానే నిర్వహించుకునేందుకు ఓ ధర నిర్ణయించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఏర్పాటు చేసిన 388 దుకాణాలకు దుకాణం స్థాయిని బట్టి లైసెన్సు జారీకి ఒక్కో దుకాణానికి రూ.6వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేసినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇవికాకుండా బాణసంచా తయారీ గోదాములకు వాటి పరిమితిని బట్టి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు నిర్ణయించి మరీ దండుకున్నట్టు తెలిసింది. ఈ లెక్కన జిల్లావ్యాప్తంగా బాణాసంచా దుకాణాలు, గోడౌన్లు, తయారీ కేంద్రాల నుంచి రూ.లక్షలు కొల్లగొట్టినట్లు సమాచారం.

వ్యాపారుల బేజారు

ఒకవైపు అధికారులు, మరో వైపు కూటమి నేతల మామూళ్ల ఒత్తిళ్లతో వ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు. రెండు రోజుల వ్యాపారానికి రూ.వేలల్లో సమర్పించుకోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఒక్కో రోజు వ్యాపారం చేసేందుకు సుదూర ప్రాంతాల నుంచి ఒక్కో దుకాణ యజమాని రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల విలువైన సరకు తీసుకు వస్తున్నారు. గతంలో కనీసం రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు లాభం వచ్చేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదని ఆందోళన చెందుతున్నారు.

నిబంధనలకు తిలోదకాలు

బాణసంచా విక్రయాలు నిర్వహించే దుకాణాల వద్ద నిబంధనలకు నీళ్లొదిలారు. రాజమహేంద్రవరం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానం, స్టేడియం రోడ్డు తదితర కేంద్రాల్లో అగ్నిమాపక నిబంధనలు పాటించడం లేదు. మంటలు అంటుకుంటే వాటిని ఆపేందుకు అవసరమైన ఫైర్‌సేఫ్టీ సిలిండర్లు కేవలం కొన్ని దుకాణాల వద్ద మాత్రమే దర్శనమిస్తున్నాయి. ఫైర్ ఇంజిన్లు కూడా కేంద్రాల వద్ద కనిపించడం లేదు. ప్రమాదాల నివారణకు అందుబాటులో నీరు, ఇసుక, అగ్నిమాపక నియంత్రణ పరికరాలు కచ్చితంగా ఉపయోగించాల్సి ఉంది. మామూళ్ల దండుకున్న అధికారులు అవేమీ పట్టించుకోవడం లేదు.

నాటి సందడేదీ..?

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది దీపావళి సందడి తగ్గింది. గతంలో మూడు రోజులకు ముందుగానే బాణసంచా కొనుగోళ్లు ఊపందుకునేవి. ప్రస్తుతం ధరలు బాగా పెరగడం, ప్రజల వద్ద డబ్బులు లేకపోవడంతో మార్కెట్లో దీపావళి సందడి కనిపించడం లేదు.

గోదావరిలో మురుగు నీరు కలవడమా..?

- అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అవగాహన లోపంతోనే దారుణం
- కూటమి ప్రభుత్వం ఏం చేస్తోంది?
- గతంలో వర్షం వచ్చినప్పుడు మాత్రమే నీరొదిలేవారు
- ఈ దుర్భాగ్య పరిస్థితి చక్కదిద్దండి
- మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మార్గాని భరత్‌రామ్ ధ్వజం



గోదావరిలో కలుస్తున్న మురుగునీటిని పరిశీలిస్తున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

సాక్షి, రాజమహేంద్రవరం: గోదావరిలో మురుగునీరు కలవడం బాధాకరమని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ ఆవేదన చెందారు. గోదావరి గట్టు వద్ద శ్రీ మార్కండేయస్వామి ఆలయంలో స్వామి వారికి భరత్, మోనా దంపతులు బుధవారం లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మాట్లాడారు. కార్తిక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతిరోజూ వేలమంది మంది ఘాట్లకు వచ్చి పుణ్య స్నానాలు ఆచరిస్తారని, ఇలా డ్రైనేజీ నీరు కల్సిన చోట ఎలా స్నానం చేస్తారని ప్రశ్నించారు. గోదావరి నదిలో మురుగు నీరు కలవకుండా కోటిలింగాల ఘాట్ నుంచి డెడికేటెడ్ చానల్ ద్వారా రాతి చానల్‌కు మురుగునీరు రామకృష్ణ థియేటర్ వెనుక ఉన్న ప్రాంతానికి చేరి ఎస్‌టీపీకి వెళుతుందన్నారు. నగరంలో విడుదలయ్యే మురుగు నీరు అంతా రాతి చానల్ ద్వారా ఆవ ప్రాంతంలోని ఎస్టీపీ డ్రైనేజీకు మళ్లించాలన్నారు. కేవలం వరదలు, వర్షాలు వచ్చినప్పుడు మాత్రమే గోదావరిలోకి నీటిని వదులుతారన్నారు. అలాంటిది ప్రస్తుతం వదిలేస్తుండటం దారుణమన్నారు. అధికారుల నిర్లక్ష్యం, ప్రస్తుత ప్రజాప్రతినిధుల అవగాహన లోపంతోనే ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత దారుణం జరుగుతుంటే అసలు కూటమి ప్రభుత్వం ఏం చేస్తోందని నిలదీశారు. ఒకపక్క స్నానాలు చేస్తుంటే, మరోపక్క డ్రైనేజీ వాటర్‌ని నేరుగా గోదావరిలో కలిపేస్తున్నారన్నారు. ఇంగిత జ్ఞానం లేకుండా ప్రవర్తిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఇక్కడ పూజ చేయడానికి వస్తేనే దుర్వాసన వస్తోందని, అసలు ఎందుకు వచ్చాంరా బాబు అనిపిస్తోందని ఆయన అన్నారు. ఎన్నో గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇలా చేయడం దారుణమన్నారు. మురుగు నీటిలో స్నానం చేస్తే జబ్బులు రావడం ఖాయమన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఘాట్లను శుభ్రం చేయడంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. కలెక్టర్, కమిషనర్ తక్షణం ఘాట్లకు వచ్చి పరిశీలించాలని కోరారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

- మౌలిక నదుపాయాలు కల్పించాలి
- 'నన్నయ' వర్సిటీ విద్యార్థినుల డిమాండ్

రాజానగరం: 'నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని' డిమాండ్ చేస్తూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ ముంగిట హాస్టల్ విద్యార్థినులు బుధవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు పడుతున్న ఇబ్బందులను 'సాక్షి'కి తెలియజేశారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

క్లీనింగ్ సరిగా ఉండదు



హాస్టల్‌లో వంటా వార్పు సెక్షన్‌లో 12 మంది వరకు ఉన్నారు. ఆహారాన్ని తయారు చేయడంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అన్నమే కాదు కూరలు కూడా సరిగా ఉడకవు. రెండు కూరలు ఉంటే వాటిలో ఏదో ఒకటే వేసుకోవాలి గానీ, రెండు వేసుకోకూడదు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– దివ్య, విద్యార్థిని

నీరసపడుతున్నాం



పక్కనే బాయిస్ హాస్టల్ ఉంది. అక్కడ ఇక్కడున్నట్టుగా ఆహారం విషయమై ఎటువంటి సమస్యలు లేవు. ఇక్కడనే ఎందుకు వస్తున్నాయి. ఇక్కడ నాణ్యత లేని ఆహారం తినడం వలనే అంతా నీరసపడిపోతున్నాం. ఈ పరిస్థితి నెలరోజులుగా మరీ ఎక్కువగా ఉంది. శానిటేషన్ కూడా సరిగా ఉండటం లేదు,

– గాయత్రి, విద్యార్థిని

గైనిక్ సమస్యలొస్తున్నాయి



హాస్టల్‌లో జాయిన్ అయ్యే వరకు గైనిక్ సమస్యలు లేవు. ఇక్కడకు వచ్చిన తరువాత అవి కూడా ఎదురవడంతో ఆహారం వల్లనే అని భావించి వార్డెన్‌కి చెపుతుంటే తింటే తినండి లేకుంటే లేదని విసుక్కుంటున్నారు. అనారోగ్య సమస్యలొస్తే ముఖ్యంగా రాత్రి వేళలలో చూసే వారు ఎవరూ ఉండటం లేదు. గతంలో ఏఎన్ఎం ఉండేవారు.

– జ్యోతి, విద్యార్థిని

యూనివర్సిటీల్లోనే కాదు సమస్యల్లోనూ పెద్దదే



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉభయ తెలుగు రాష్ట్రాలలో పెద్ద యూనివర్సిటీగా పేరొందింది. దానికి తగ్గట్టుగానే ఇక్కడ సమస్యల తీవ్రత కూడా పెద్దగానే ఉంది. ముఖ్యంగా యూనివర్సిటీ హాస్టల్‌లో సరైన ఆహారం అందక ఆడపిల్లలు అనేక అవస్థలు పడుతున్నారు. వారికి అవసరమైన మౌలిక సదుపాయాలకు కూడా ఇక్కడ కరువే. వీటి గురించి వార్డెన్‌గా ఉన్న అధికారిణి సాటి మహిళగా అర్థం చేసుకోకుండా మార్కులు తగ్గపోతాయని బెదిరించడం విచారకరం.

– సత్యసాయి, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) విభాగ్ కన్వీనర్

నాలుగు రోజుల నుంచి అసలు తినలేకపోతున్నాం



హాస్టల్‌లో ప్రధానంగా ఆహారం అసలు బాగోడం లేదు. ఈ కారణంగానే నాలుగు రోజులుగా మాలో చాలామంది తిండి తినకుండా పస్తులు ఉంటున్నారు. ఎందుకంటే ఏ రోజు కూడా కూరలు సరిగా ఉడకవు, బియ్యం నాసిరకం కావడంతో అన్నం బాగోదు. వీటి గురించి పలుమార్లు ఫిర్యాదు చేసినా ఏ మార్పు లేకనే తినడం మానేశాం.

– మౌనిక, విద్యార్థిని

దీపావళి కావాలి ఆనంద కేళి

- ప్రమోదం కాకూడదు ప్రమాదం
- కాలుష్యం నుంచి మాస్కులతో రక్ష
- వెలుగుల పండుగకు జిల్లా సిద్ధం

రాజమహేంద్రవరం రూరల్: దీపావళి అంటేనే వెలుగుల పండగ, అమావాస్య చీకట్లను చీల్చుతూ ఎటు చూసినా దీపాల సొబగులే. అంబరాన్నంటే సంబరాలే. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా హిందువులంతా ఎంతో ఆనందోత్సవాలతో చేసుకునే పండగతో ప్రతీ ఇల్లు కళకళలాడుతుంది అయితే ఈ ప్రమోదం వెనుకే ప్రమాదం పొంచి ఉందన్న విషయం చాలామంది గుర్తెరుగరు. బాణసంచా కాల్చేటప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యం చూపినా పెను ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది. అవి మిగిల్చిన చేదు జ్ఞాపకాలు జీవితాంతం వెంటాడుతూనే ఉంటాయి. దీపావళి పండగను జరుపుకునేందుకు జిల్లా సిద్ధమైంది. దీపావళి అంటే ప్రతీ మదిలో మెదిలేది టపాసులు, క్రాకర్స్, చిచ్చుబుడ్డి వెలుగులు. గతంలో పిండివంటలు చేసుకుని..మట్టి ప్రమిదలలో దీపాలు వెలిగించుకొని, దివిటీలు తిప్పుతూ పండగ జరుపుకునేవారు. ఇవి ప్రకృతికి పెద్దగా నష్టం కలిగించేవి కాదు. నేటి మన జీవన విధానం...పండగ చేసుకునే తీరు... ప్రకృతి వనరులు, చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధిగ్రస్తులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నో జాగ్రత్తలతో పండగ జరుపుకోవాల్సిన అవసరం ఏర్పడింది. వాయు కాలుష్యం హృదయ, శ్వాసకోశ వ్యాధులను తీవ్రతరం చేస్తుంది. గుండె, ఊపిరితిత్తులపై ప్రభావితం చూపుతుంది. గుండెపోటుకు దారి తీసే అవకాశం ఉంది. అందుకే ముందు జాగ్రత్తగా దీపావళి రోజు మాస్కులు ధరించి టపాసులు కాల్చాలని వైద్యులు సూచిస్తున్నారు. పర్యావరణ కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొన్న కొన్ని సంస్థలు యాంటీ పొల్యూషన్ మాస్కులను విరివిగా విక్రయిస్తున్నాయి. బాణసంచా దుకాణాల్లో ఇవి లభిస్తున్నాయి.

జాగ్రత్తలు మరువొద్దు




దీపావళి పండగను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలి. శబ్ద కాలుష్య రహిత బాణసంచాకు ప్రాధాన్యమివ్వాలి. బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి.

– డి.నరసింహకిషోర్, ఎస్పీ, తూర్పుగోదావరిజిల్లా



బాణసంచా షాపుల వద్ద సందడి

బాధ్యతాయుతంగా ఉండాలి



టపాసులు అమ్మేవారందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.అగ్ని నిరోధక పరికరాల్లో కనీసం ఒకటైనా అందుబాటులో ఉంచాలి. ఇసుక, నీటిని తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. ఇళ్లల్లో టపాసులు కాల్చేటప్పుడు మహిళలు, యువతులు, చిన్నారులు కాటన్ దుస్తులు ధరించాలి. టపాసులు కాల్చేటప్పుడు నీటిని అందుబాటులో ఉంచాలి. ఆనందోత్సవాల మధ్య దీపావళి పండగ నిర్వహించుకోవాలి.

– మార్టిని లూథర్‌కింగ్, జిల్లా అగ్నిమాపక అధికారి, తూర్పుగోదావరి

అత్యవసర నంబర్లు

- 108: అగ్నిప్రమాదంలో ఎవరైనా గాయపడితే వెంటనే 108కు ఫోన్‌చేయాలి. ప్రమాదం ఎక్కడ జరిగిందో లోకేషన్ వివరాలు స్పష్టంగా తెలియజేయాలి.
- 101 : అగ్నిప్రమాదం జరిగితే అగ్నిమాపకశాఖ కార్యాలయానికి సమాచారం అందించాలి.
- 100 : అత్యవసర సమాచారం ఏదైనా 100కు ఫోన్ చేసి తెలియజేయాలి.

అగ్నిమాపక కేంద్రాలు, అధికారుల ఫోన్ నంబర్లు...

రాజమహేంద్రవరం : పి.శ్రీనివాస్ ఏడీఎఫ్‌వో (అసిస్టెంట్ డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్) 0883-2444101 9963727248

అనపర్తి : జే.శ్రీనివాసరెడ్డి ఎస్ఎఫ్‌వో (స్టేషన్ ఫైర్ ఆఫీసర్) 08857-227201 9963728023

నిడదవోలు : కె.శ్రీనివాసరావు ఏడీఎఫ్‌వో 08813-221101 9963726317

కొవ్వూరు : ఏవిఎస్ఎస్ఎస్ వేణు ఎస్ఎఫ్‌వో 08813-231101 9963726417

కోరుకొండ : పి.శ్రీనివాస్(ఇన్‌చార్జి), ఏడీఎఫ్‌వో 0883-2496101 9963727248

బాణసంచా కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వినియోగదారులు నాణ్యమైన పటాసులు మాత్రమే కొనుగోలు చేయాలి
- పైకి ఎగిరే తారాజువ్వలను గడ్డికుప్పలు, పూరిగుడిసెలకు దూరంగా కాల్చాలి.
- కాల్చేటప్పుడు చెప్పులు, బూట్లు ధరించాలి.
- పెద్దల పర్యవేక్షణలో పిల్లలు బాణసంచా కాల్చడం ఉత్తమం.
- సరిగ్గా కాలని వాటిని మళ్లీ వెలిగించడం, ఊదడం చేయకూడదు.
- తక్కువ శబ్దం వచ్చే వాటిని ఎంచుకోవాలి.
- పేలుడు పదార్థాలను పిల్లలకు దూరంగా ఉంచాలి.
- కాల్చేటప్పుడు నీటిని అందుబాటులో ఉంచుకోవాలి. చేతిలో టపాసులు కాల్చడం, వెలిగించి విసిరి వేయడం వంటివి చేయకూడదు.
- ఇంటిలోపల బాణసంచా కాల్చరాదు.
- సెర్చిలైట్లు, చిచ్చుబుడ్లను చేతితో పట్టుకుని కాల్చవద్దు. వాటిని పట్టుకుని కాల్చడం వల్ల చాలామందికి మొహం, అవయవాలు కాలిపోయిన సందర్భాలు ఉన్నాయి.
- కాలని బాణసంచాను నీళ్లలో పూర్తిగా ముంచాలి.

దుకాణాల వద్ద అగ్నిమాపక అవుట్ పోస్టులు

రాజమహేంద్రవరం నగరంలో జనం రద్దీని దృష్టిలో ఉంచుకుని అగ్నిమాపకశాఖ అధికారులు బాణసంచా దుకాణాల వద్ద అగ్నిమాపక అవుట్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఆర్ట్సుకళాశాల మైదానంలో ఫైర్‌ఇంజన్లు, పది షాపులకు మించి ఉన్న ప్రదేశాలలో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు ఏర్పాటు చేశారు. పెద్ద దుకాణాల వద్ద ఇద్దరు ఫైర్‌మెన్‌లతో ఒక అగ్నిమాపక అవుట్ పోస్టును ఏర్పాటు చేశారు.

వీరు బాణసంచా దుకాణాల వద్ద, సమీప ప్రాంతాల్లో ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే వెంటనే స్పందిస్తారు.

వర్షం రాకతో వెలవెలబోతున్న దుకాణాలు

బుధవారం మధ్యాహ్నం సమయంలో వర్షం పడడంతో బాణసంచా దుకాణాలన్నీ కొనుగోలు చేసేవారు రాకపోవడంతో వెలవెలబోతున్నాయి. వేలాది రూపాయలు చెల్లించి లైసెన్సులు పొందడంతో పాటు లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి దుకాణాలు ఏర్పాటు చేస్తే కనీసం పెట్టుబడి అయినా వస్తుందన్న అనుమానం వ్యాపారుల్లో వ్యక్తమవుతోంది. కొనుగోళ్లు దీపావళి రోజైన గురువారం స్పీడు అందుకుంటాయని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీపావళి పండగ నెలాఖరు రావడం కూడా ప్రజల వద్ద సొమ్ము లేకపోవడం ఒక కారణంగా వ్యాపారులు అంటున్నారు.



వీఎల్‌పురం బాణసంచా దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన అగ్నిమాపక అవుట్‌పోస్టు

క్లుప్తంగా

మధ్య లంకలో ఎలుగుబంటి సంచారం!



ఎలుగుబంటిని చూశామని చెబుతున్న మత్స్యకారులు

మామిడికుదురు: పాశర్లపూడి లంక గ్రామ పరిధిలోని గోదావరి మధ్య లంకలో కొన్ని రోజుల నుంచి ఎలుగుబంటి సంచరిస్తుందని స్థానిక మత్స్యకారులు అంటున్నారు. రాత్రి వేటకు వెళుతున్న సమయంలో దానిని చూసి కంగారు పడ్డామని మత్స్యకారులు భైరవస్వామి, నూకరాజు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. చూడడానికి భయంకరంగా భారీగా ఉన్న జంతువును ఎలుగుబంటిగా అనుమానిస్తున్నామన్నారు. జంతువు సంచారంతో రాత్రి సమయంలో వేటకు వెళ్లేందుకు భయం వేస్తుందన్నారు. దీనిపై అటవీ శాఖ అధికారులు స్పందించి ఆ జంతువు బారి నుంచి మత్స్యకారులకు రక్షణ కల్పించాలని సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాష్ కోరారు.

అయ్యప్ప భక్తుడిపై నీటి పిల్లి దాడి!



గాయపడిన విజయ్‌కుమార్

ఆలమూరు: స్థానిక పెద్దకాలువ రేవులో స్నానం చేస్తున్న అయ్యప్ప భక్తుడిపై నీటి పిల్లి దాడి చేసిన సంఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారుడు పి.విజయ్‌కుమార్ వేకువజామునే స్నానం చేయడానికి రేవు వద్దకు వెళ్లాడు. స్నానం చేస్తుండగా అంతలో నీటిలో నుంచి పిల్లి అతనిపై దూకి గాయపర్చింది. భయాందోళన చెందిన విజయ్‌కుమార్ భయాందోళనతో పరుగున ఒడ్డుకు చేరుకున్నాడు. స్థానికుల సాయంతో ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అయితే 1 నుంచి కార్తికమాసం ప్రారంభం కావడంతో అనేక మంది భక్తులు ఈ రేవుకు వచ్చి స్నానాలు ఆచరించడం ఆనవాయితీగా వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో మునుపెన్నడూ లేని విధంగా నీటి పిల్లి దాడి చేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

వీఓఏ తొలగింపునకు ఉత్తర్వులు

మలికిపురం: పడమటిపాలెం డీఆర్‌డీఏ వెలుగు వీఓఏ యడ్ల సుమలతను తొలగించాలని సూచిస్తూ జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ శివ శంకర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం గ్రామ సభలో వీఓఏ సుమలత పలు అక్రమాలకు పాల్పడ్డారని, తమ రుణాల నగదును దారి మళ్లించారని గ్రామ నీ కృపా డ్వాక్రా సంఘ సభ్యులు నల్లి గీత, కొప్పాడి సత్యమణి, తాడి మేరి తదితరులు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఆర్‌డీఏ, వెలుగు సిబ్బంది విచారణ జరిపి అక్రమాలు గుర్తించారు. నిధులు మళ్లించడంతో పాటు సెర్ప్ వెబ్‌సైట్‌లో సభ్యుల పేర్లు నమోదు చేయలేదని, గ్రూపుల నిర్వహణ కూడా సక్రమంగా లేదని తెలుసుకున్నారు. వీఓఏ అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించడంతో తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మండల వెలుగు ఏపీఎంకు సూచిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. పీడీ శివశంకర్ విలేకరులతో మాట్లాడుతూ ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసినట్లు ధ్రువీకరించారు.

బడుగులపై పిడుగు

- బాణసంచా తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం
- పిడుగు పడి భారీ విస్ఫోటం
- ఇద్దరి దుర్మరణం, ఐదుగురికి తీవ్ర గాయాలు
- బాధితులంతా పశ్చిమగోదావరి జిల్లా వాసులు
- ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో ఘటన



తణుకు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట బంధువుల రోదనలు



చుక్కా పెద్దింట్లు



విప్పర్తి వెంకటేశ్వరరావు



మందలంక కమలరత్న



శీలం లక్ష్మి



కడిమి కుమారి

తణుకు: వారంతా దినసరి కూలీలు.. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలు.. దీపావళీ బాణసంచా తయారీలో నిమగ్నం అయ్యారు. అప్పటికే వర్షం కురుస్తుండటంతో అనుకోని రీతిలో అక్కడే కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. పిడుగు ధాటికి బాణసంచా కేంద్రంలో విస్ఫోటం సంభవించింది. తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన వేగిరోతు శ్రీవల్లి (50), పెంటపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన గుమ్మడి సునీత (35) ఘటనా స్థలంలోనే మృతి చెందగా, కడిమి కుమారి (దువ్వ), చుక్కా పెద్దింట్లు (దువ్వ), మందలంక కమలరత్న (రావిపాడు), శీలం లక్ష్మి (రావిపాడు), విప్పర్తి వెంకటేశ్వరరావు (కావలిపురం) తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే 90 శాతం కాలిన గాయాలు ఉండటంతో వీరందరినీ ఏలూరు ఆశ్రమ్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో క్షతగాత్రులను తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావులు పరామర్శించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.అరుణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారణాసి పర్యటనలో ఉన్న మంత్రి కందుల దుర్గేష్ ఈ ఘటనపై ఆరా తీసి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు.

బాధితులంతా రోజువారీ కూలీలే..

బాణసంచా తయారీ కేంద్రంలో పని చేస్తున్న వారంతా రోజువారీ కూలీలే. ప్రతి ఏడాది దీపావళికి రెండు నెలల ముందు నుంచి బాణసంచా తయారీ కేంద్రంలో కూలీలు పనిచేస్తుంటారు. తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన వేగిరోతు శివకు చెందిన బాణసంచా తయారీ కేంద్రంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. కొన్నేళ్లుగా తణుకు మండలం దువ్వ వెంకయ్య వయ్యేరు ఆనుకుని తోటల్లో బాణసంచా తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేవారు. అయితే గతేడాది దువ్వలో లైసెన్సు ఇవ్వకపోవడంతో పశ్చిమగోదావరి జిల్లా సరిహద్దు గ్రామమైన ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం నుంచి కాల్దరి వెళ్లే రోడ్డులో తయారీ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రంలో సుమారు 20 మంది కూలీలు పని చేస్తున్నారు.

ఏడేళ్ల క్రితం తల్లిదండ్రులు.. ఇప్పుడు భార్య

కొన్నేళ్లుగా బాణసంచా తయారీ కేంద్రాన్ని కుటీర పరిశ్రమగా వేగిరోతు శివ నిర్వహిస్తున్నారు. సుమారు ఏడేళ్ల క్రితం దువ్వ గ్రామంలోని తన నివాసంలో బాణసంచా నిల్వలు పేలిపోవడంతో శివ తల్లిదండ్రులు సజీవ దహనం అయ్యారు. అయినప్పటికీ తయారీ కేంద్రం కొనసాగిస్తున్నారు. బుధవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో శివ తన భార్య వేగిరోతు శ్రీవల్లి ప్రాణాలు కోల్పోయారు. దీంతో కుటుంబంలో తల్లిదండ్రులతోపాటు భార్యను కూడా తాను నమ్ముకున్న కుటీర పరిశ్రమ మింగేయడం గమనార్హం.

20 రోజుల క్రితమే అల్లుడి మృతి

కావలిపురం గ్రామానికి చెందిన విప్పర్తి వెంకటేశ్వరరావు కొన్నేళ్లుగా బాణసంచా తయారీ కేంద్రంలో పని చేస్తున్నారు. సీజన్ పూర్తయ్యాక ఇటుకల బట్టీలో పని చేస్తుంటారు. వెంకటేశ్వరరావు, కుమారి దంపతులకు కుమారుడు, కుమార్తె కాగా కుమార్తె లక్ష్మీశోభకు గొల్లపల్లి సురేష్‌తో వివాహం చేశారు. అయితే 20 రోజుల క్రితమే అల్లుడు సురేష్ గుండెపోటుతో మృతి చెందడం పట్ల ఆ కుటుంబం జీర్ణించుకోలేకపోతోంది.

- తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన కడిమి కుమారి భర్త త్రిమూర్తులు కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. కుమారుడు జయరాజు తాపీ పని చేసుకుంటున్నారు. గతంలో ఎప్పుడూ ఈ పనికి వెళ్లని కుమారి రెండు నెలలుగా ఈ పనికి కుదిరింది. కొన్నేళ్లుగా ఐస్‌క్రీం ఫ్యాక్టరీకు వెళుతున్న కుమారి డబ్బులు ఎక్కువ వస్తున్నాయని బాణసంచా తయారీ కేంద్రంలో చేరింది. అనుకోని రీతిలో జరిగిన ప్రమాదంలో కుమారి తీవ్రంగా గాయపడింది.
- పెంటపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన మందలంక కమలరత్న నాలుగు రోజుల నుంచే పనిలోకి వెళుతోంది. కమలరత్నం వెంకట్రావు దంపతులకు ఇద్దరు కుమారులు కాగా వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు.
- పెంటపాడు మండలం శీలం లక్ష్మి రెండు నెలలుగా ఇక్కడే పని చేస్తున్నారు. భర్త దుర్గారావు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ దుర్ఘటనలో లక్ష్మికి తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.
- తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన చుక్కా పెద్దింట్లు నెల రోజులుగా బాణసంచా తయారీ కేంద్రంలో పని చేస్తున్నారు. భర్త మునలయ్య కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. సాధారణ రోజుల్లో పెద్దింట్లు వంట పనులకు వెళుతూ ఉంటుందని కుమార్తె ప్రసన్న ప్రవల్లిక చెబుతున్నారు.

కబడ్డీ క్రీడాకారుల ఎంపికలో పక్షపాతం

ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యుల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు

సామర్లకోట: యూనివర్సిటీ రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టులో క్రీడాకారుల ఎంపిక పక్షపాతంగా జరిగిందని ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు ఆరోపించారు. బుధవారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు విలేకర్ల సమావేశంలో జట్టు ఎంపికపై విమర్శలు చేశారు. ఇటీవల మండపేటలో జరిగిన ఎంపికల్లో ఆదికవి నన్నయ యూనివర్సిటీకి చెందిన టీమ్‌లో అత్యంత ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను పక్కన పెట్టారని కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీను, ఉపాధ్యక్షుడు కిరణ్, సహాయ కార్యదర్శి సరోజ్ వాసులు ఆరోపించారు. జట్టులో నన్నయ యూనివర్సిటీకి చెందిన క్రీడాకారుడు వెంకట్ 50 పాయింట్లకు 40 పాయింట్లు తీసుకు వచ్చినా అన్యాయం జరిగిందన్నారు. సెలక్షన్ కమిటీలో సభ్యులుగా ఉన్న నరసింహరాజు, మూర్తి, ప్రభాకర్‌లకు కబడ్డీలో ఎటువంటి అనుభవం లేదన్నారు. ఠాగూర్, అనిల్ డిఫెన్స్‌లో ప్రతిభ కనబర్చారని తెలిపారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను పట్టించుకోక పోతే వారికి గుర్తింపు ఎప్పుడు వస్తుందని ప్రశ్నించారు. సెలక్షన్ కమిటీలు సక్రమంగా లేకపోతే రాష్ట్రం, దేశంలోనే క్రీడాకారులు కనుమరుగై పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. యూనివర్సిటీకి చెందిన కబడ్డీ క్రీడాకారులకు న్యాయం చేయాలని నన్నయ యూనివర్సిటీ వైస్ చాన్సిలర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామని, ఇప్పటి వరకూ న్యాయం జరగలేదన్నారు. క్రీడాకారులైన వెంకట్, ఠాగూర్, అనిల్‌లు తమకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. యూనివర్సిటీలో ఇదే తమకు చివరి అవకాశమని వారు అన్నారు. క్రీడాకారుల ప్రతిభను గుర్తించాల్సిన సెలక్షన్ కమిటీ తప్పుదారి పట్టడంపై పలువురు విమర్శించారు. ఇప్పటికైనా ప్రతిభ కలిగిన క్రీడాకారులకు గుర్తింపు ఇవ్వాలని కోరుతున్నారు.

ఏం జరుగుతోందబ్బా..

- ఉమ్మడి జిల్లాలో సీఐడీ సోదాలు
- ఉదయం నుంచి రాత్రి వరకూ తనిఖీలు



ఆవపాడులోని ఎంఎం బయోటెక్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీఐడీ అధికారులు

రాయవరం: సీఐడీ అధికారులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన తనిఖీలు చర్చనీయాంశమయ్యాయి. రాయవరం మండలం చెల్లూరులోని శ్రీసర్వారాయ షుగర్ ఫ్యాక్టరీలో సోదాలు చేశారు. విశాఖపట్నం నుంచి సీఐడీ అధికారులు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బందోబస్తు కోసం సంప్రదించినట్లు తెలిసింది. బుధవారం ఉదయం వరకూ ఎక్కడ విచారణ జరుపుతుందీ కూడా గోప్యంగా ఉంచి, ఉదయాన్నే చెల్లూరు సర్వారాయ షుగర్ ఫ్యాక్టరీకి వెళ్లారు. సుమారు ఐదుగురు అధికారులు ఈ తనిఖీల్లో పాల్గొన్నట్లు సమాచారం. ఉదయం లోపలకు ప్రవేశించిన వారు రాత్రి 7.30 గంటల వరకూ సోదాలు చేస్తున్నట్లు తెలిసింది. షుగర్ ఫ్యాక్టరీ మూతపడి ఉండగా, డిస్టలరీలో మొలాసిస్ ఉత్పత్తి అవుతున్నట్లుగా సమాచారం. మొలాసిస్‌ను ఫిల్టర్ చేస్తే ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ఈఎన్ఏ) ఉత్పత్తి అవుతుంది. అయితే ప్రస్తుతం సీఐడీ అధికారులు చేస్తున్న సోదాలు ఈఎన్ఏ ఉత్పత్తికి సంబంధించినదా? కాదా? అనేది పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. గతంలో ఇక్కడ ఉత్పత్తయిన స్పిరిట్ ఏ ఏ ప్రాంతాలకు సరఫరా చేశారనే విషయాలపై ప్రధానంగా రికార్డులు తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై రాయవరం ఎస్సై పి.బుజ్జిబాబును వివరణ కోరగా, తన వద్ద ఎటువంటి సమాచారం లేదన్నారు.

ఏకకాలంలో దాడులు

తాళ్లపూడి: మండలంలోని తుపాకులగూడెం రెవెన్యూ పరిధిలో రెండు బెవరేజస్ ఫ్యాక్టరీలపై బుధవారం ఏకకాలంలో సీఐడీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఉదయం 9 గంటల సమయానికి రెండు బృందాలుగా వచ్చి రెండు ఫ్యాక్టరీల్లోకి సీఐడీ అధికారులు వెళ్లారు. విజయవాడకు చెందిన సీఐడీ అధికారులు కేప్రికార్న్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్, అదేవిధంగా బీ9 బెవరేజస్ లిమిటెడ్ (బీర్) ఫ్యాక్టరీల్లో తనిఖీలు చేపట్టారు. వారితో పాటు రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది ఉన్నారు. ఇతరులను లోపలకు అనుమతించలేదు. ఎటువంటి సమాచారం బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. సాయంత్రం వరకూ తనిఖీలు కొనసాగాయి. పలు రికార్డులను పరిశీలించి కొన్నింటిని స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఈ సమాచారం విజయవాడలోని కార్యాలయానికి అందజేస్తామని అధికారులు తెలిపారు.

ఎంఎం బయోటెక్‌లో..

నల్లజర్ల: మండలంలోని ఆవపాడు సమీపంలోని ఎంఎస్ బయోటెక్ ఫ్యాక్టరీలో సీఐడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఇక్కడ తయారైన ఎగ్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్‌కు సంబంధించి ఏ డిస్టలరీకు ఎంత మొత్తంలో వెళ్లిందనే విషయాలు, రికార్డులను తనిఖీ చేశారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన సోదాలు సాయంత్రం 6 గంటల వరకూ జరిగాయి. సీఐడీ డీఎస్పీ (రాజమహేంద్రవరం)వై.శ్రీనివాసరావు, పీఏ వెంకటేశ్వరావు, ఎస్ఐ ఫణికుమార్, ఎక్సైజు సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



లాన్ టెన్నిస్ పోటీల్లో విజేతలకు పతకాలు అందించిన అతిథులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ తెలిపారు. స్థానిక జిల్లా క్రీడా మైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-14, 17, 19 అంతర్ జిల్లాల లాన్ టెన్నిస్ పోటీలు బుధవారంతో ముగిశాయి. పోటీల ముగింపు కార్యక్రమానికి కాకినాడ జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కేవీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా శ్రీనివాస్ కుమార్, గౌరవ అతిథిగా తలాటం హరీష్, రాష్ట్ర లాన్ టెన్నిస్ సంఘ కార్యదర్శి పీవీ రామ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి విజేతలు జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. మూడు రోజుల పాటు జరిగిన పోటీలను ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్ర పరిశీలకుడు బాబు, వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహించామన్నారు. టోర్నమెంట్ చీఫ్ రిఫరీ శ్రీకుమార్‌ను అభినందించారు. అనంతరం విజేతలకు అతిథులు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. పోటీల నిర్వహణ కార్యదర్శి జార్జి, ఎస్‌జీఎఫ్ఐ సంయుక్త కార్యదర్శులు సునీల్, పరశురాం, బి.సురేష్‌రాజు, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు, కార్యదర్శి నూకరాజు, కోశాధికారి కౌర్, పీడీలు సూరిబాబు, ఇమ్మానుయేల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు..

అండర్-19 బాలికల విభాగంలో టి.హిమజరెడ్డి (చిత్తూరు), వై.భావన (విశాఖ), ఎస్‌డీ టోహిప్‌కా (విశాఖ), కె.వైష్ణవి (అనంతపురం), టి.మోక్ష (విశాఖ), బాలుర విభాగంలో బి.కరుణకుమార్ (చిత్తూరు), ఎస్.చరణ్ కుమార్ (గుంటూరు), షేక్ అబుబక సిద్దిక్ (చిత్తూరు), పి.జీవన్ గౌతమి (గుంటూరు), ఎస్‌కే అబరార్ అహ్మద్ (గుంటూరు) జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. అండర్-17 బాలికల విభాగంలో టి.విషిమ (నెల్లూరు), జి.జోషిత(గుంటూరు), ఎ.మనస్వి (చిత్తూరు), జి.మేధశ్రీ (తూర్పు), ధన్విశ్రీ (చిత్తూరు), బాలుర విభాగంలో వై.ఇషాన్ (కృష్ణా), డి.సాయిశంకర్ (కర్నూలు), కె.శౌర్య (విశాఖ), టి.విశృత్ సాయి (నెల్లూరు), బి.యశ్వంత్ (విశాఖ), అండర్-14 విభాగంలో కె.విన్సెంట్ (గుంటూరు), వి.భువన్ ధీరజ్ (పశ్చిమ), యు.సాయి శౌర్య (కృష్ణ), ఐ.దుర్గశ్రీ అఖిల్ (పశ్చిమ), వై.క్రిష్ (కృష్ణ), బాలికల విభాగంలో సాయి సంజనరెడ్డి (చిత్తూరు), ఎన్.లేఖ్యశ్రీ (పశ్చిమ), ఎ.శ్రీవైషాలి(కృష్ణ), జి.అక్షయ (శ్రీకాకుళం), పి.లోచన (తూర్పు)లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని టోర్నమెంట్ చీఫ్ రిఫరీ శ్రీకుమార్, ఎస్‌జీఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి జార్జి తెలిపారు.

న్యాయం చేయాలని వేడుకోలు



తనకు న్యాయం చేయాలని ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను కోరుతున్న యువతి

అమలాపురం టౌన్: అమలాపురం కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను అంబాజీపేటకు చెందిన ఓ యువతి తనకు న్యాయం చేయండంటూ వేడుకుంది. ఆ యువతి ఏడేళ్ల నాటి తన ప్రేమ పెళ్లి విషయంలో జరిగిన మోసాన్ని, పోలీసులు పెడుతున్న ఇబ్బందులను ఆ ప్రజాప్రతినిధులకు వివరించింది. సమావేశానంతరం ఎంపీ గంటి హరీష్ మాధుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావులకు తనకు జరిగిన, జరుగుతున్న అన్యాయాన్ని చెప్పింది. 2017లో గౌస్ మొహిద్దీన్ అనే యువకుడు, తాను ప్రేమించుకున్నామని తెలిపింది. అతను పెళ్లికి నిరాకరించడంతో పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించానని చెప్పింది. పోలీస్ స్టేషన్‌లో అప్పట్లో ఆ యువకుడికి, తమకు అప్పటి ఎస్సై ఆర్.భీమరాజు సమక్షంలో పెళ్లి చేశారని పేర్కొంది. కేవలం 20 రోజులు తనతో ఉండి అతను తనను విడిచి వెళ్లిపోయాడని తెలిపింది. అప్పట్లో ఇదే సమస్యపై అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే చాన్నాళ్లు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆరోపించింది. తర్వాత కొన్నేళ్లకు ఎఫ్ఐఆర్ వేసి కేసు నమోదు చేశారని పేర్కొంది. అప్పటి నుంచి కోర్టులో న్యాయం కోసం పోరాడుతున్నానని వివరించింది. అయితే అంబాజీపేట పోలీసులు ఇప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వాలని పదే పదే తనపై ఒత్తిడి తెస్తున్నారని చెప్పింది. కోర్టులో అప్పటి ఎస్సై భీమరాజుపై కేసు వేయగా ఇప్పుడు ఛార్జిషీట్‌లో ఆయన పేరు లేకపోవడాన్ని ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు వివరించింది. దీంతో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అంబాజీపేట పోలీసు స్టేషన్‌కు ఫోన్ చేసి ఆ యువతి ఆవేదనను వివరించారు. న్యాయం జరిగేలా చేస్తామని ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఆమెకు హామీ ఇచ్చారు.

విషాదం మిగిల్చిన విహారం

- గుజరాత్‌లో ఇద్దరు కొవ్వూరు విద్యార్థుల మృతి



రంభ రవితేజ (ఫైల్)



రాయిపాటి రోహిత్ (ఫైల్)

కొవ్వూరు: విహారయాత్ర రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. గుజరాత్‌లోని వాటర్ ఫాల్స్ వద్దకు విహారయాత్రకు వెళ్లి ఫొటో తీసే ప్రయత్నంలో జారిపడి కొవ్వూరుకు చెందిన రంభ రవితేజ (20), మండలంలోని వేములూరుకు చెందిన రాయిపాటి రోహిత్ (20) అనే ఇద్దరు విద్యార్థులు దుర్మరణం చెందారు. వారిద్దరూ గుజరాత్ రాష్ట్రంలోని వడోదర పారూల్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నారు. స్నేహితులతో కలసి మంగళవారం వాటర్ ఫాల్స్ వద్ద విహారయాత్రకు వెళ్లారు. రవితేజ ఫొటో తీస్తూ జారి పడుతుండడంతో రోహిత్ చేయి అందించి పట్టు కునే ప్రయత్నం చేశారు. దురదృష్టవశాత్తూ ఇద్దరూ వాటర్‌ఫాల్స్‌లో పడ్డారు. బండరాయిపై వెనక్కి పడిన రవితేజ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందినట్టు చెబుతున్నారు. రోహిత్ మృతదేహం మట్టిలో కూరుపోయి బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు లభ్యమైనట్టు తెలిసింది. ప్రమాద విషయం తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు గుజరాత్ బయల్దేరి వెళ్లారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఈ విషయాన్ని బీజేపీ గుజరాత్ రాష్ట్ర అధ్యక్షుడికి, అక్కడి కలెక్టర్, ఎస్పీల దృష్టికి తీసుకెళ్లారు. మృతదేహాలను త్వరితగతిన కొవ్వూరు రప్పించే ప్రయత్నాలు చేయాలని ఎంపీ సూచించారు. రవితేజ హోమ్ సిక్‌తో ఇటీవల ఇంటికి వచ్చి 20 రోజులపాటు కొవ్వూరులోనే ఉన్నాడు. రవితేజకు సోదరి, తల్లిదండ్రులు ఉన్నారు. రోహిత్ చదువు కోసం తల్లిదండ్రులు కూడా గుజరాత్‌లోనే ఉంటున్నారు. పొలంలో చెరకు నరుకు ఉండడంతో ఇటీవలే రోహిత్ తండ్రి గోవిందరాజు వేములూరు వచ్చారు. ఇంతలోనే విషాద వార్త విని మళ్లీ గుజరాత్ పయనమయ్యారు. రోహిత్‌కి తల్లిదండ్రులతో పాటు ఒక సోదరి ఉన్నారు. రోహిత్ అమ్మమ్మ స్వస్థలం కొవ్వూరు. దీంతో ఇటు వేములూరులోను, అటు కొవ్వూరులోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి.

వుమెన్ క్రికెట్ పోటీలు ప్రారంభం

రాజానగరం: స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీ, కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో నిర్వహించే వుమెన్ క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ బుధవారం ప్రారంభించారు. గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల నుంచి హాజరైన క్రీడాకారుల నుంచి అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 15 మందిని యూనివర్సిటీ జట్టుగా ఎంపిక చేశారు. వచ్చే నెల 15 నుంచి మైసూరు యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ పోటీల్లో వీరు పాల్గొంటారని స్పోర్ట్స్ బోర్డు ఇన్‌చార్జి సెక్రటరీ, రిజిస్ట్రార్ జి.సుధాకర్ తెలిపారు.

భర్తపై వేడి నూనె పోసిన భార్య



తీవ్రంగా గాయపడిన సాయికుమార్

అన్నవరం: భర్తపై వేడి నూనె పోయడంతో అతను తీవ్రంగా గాయపడి తుని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా నకిరేకల్లుకు చెందిన మేకల సాయికుమార్, మండపం గ్రామ శివారు కొండ గైరంపేట చెందిన చాగంటి రాజ్యలక్ష్మికి ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. వీరు అన్నవరంలోని వెలంపేటలో నివాసం ఉంటున్నారు. రాజ్యలక్ష్మి ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తోంది. కాగా, భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు అవుతుండడంతో సాయికుమార్ తన స్వగ్రామం వెళ్లిపోయాడు. అయితే భార్య అక్కడకు వెళ్లి కాపురానికి రాకపోతే పిల్లలను ఇక్కడే వదిలేస్తానని బెదిరించడంతో తిరిగి అన్నవరం వచ్చినట్లు సాయికుమార్ చెప్పాడని ఎస్ఐ తెలిపారు. మంగళవారం రాత్రి సాయికుమార్ ఇంటికి రాగా ఇంత ఆలస్యం ఎందుకు అయ్యిందని రాజ్యలక్ష్మి ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. గొడవ పెరగడంతో పొయ్యి మీద పెనంలో గల వేడి నూనెను సాయికుమార్‌పై ఆమె పోసింది. దీంతో అతని వీపు మీద చర్మం కాలి బొబ్బలెక్కడంతో హుటాహుటిన తుని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భర్త సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీహరిబాబు తెలిపారు.